

# గుడ్ బై

- గోపరాజు నాగేశ్వరరావు

తెలుగు సంస్కృతిని ధ్వంసం చేసికొంటూ తెలుగు భాష అంతరించిపోతోందని గగ్గోలు పెట్టటం మన మరో విలక్షణత! సూటూ బూటూ వేసి 'టై' కట్టి, తరగతి గదిలో తెలుగు పంతులు గారు "లెటజ్ కం టు ది పాయింట్" అని అరిచి ఆదికవి నన్నయ గురించి అనర్గళంగా మాట్లాడినా అసహ్యంగానే వుంటుంది. పార వశ్యం ఆవహించి పద్య పాదాలను శ్రావ్యంగా పాడి వినిపించినా ఎబ్బెట్టుగానే వుంటుంది.

అలాంటి ఎబ్బెట్టు, అసహ్యమూ సహించదు గనుకనే నాకు తెలుగు పంతులుగారు నారాయణగారంటే భలే ఇష్టం! చాలా మంది మాటల్లో మృదుత్వం ధ్వనిస్తుందేమోగానీ పంతులుగారి మాటల్లోనే కాదు, 'మూర్తి'లో కూడా మృదుత్వమే కనుపిస్తుంది. ఆయనగారంటే నా 'భలే ఇష్టా'నికి కారణం అదే...

"తెలుగు పంతులుగారూ! పంచె కట్టువాళ్లు పొలం గట్లమీద తిరగాలి గానీ తెలుగు పంతుళ్లుగా వచ్చి మా ప్రాణాలు తీస్తే యెలా? నిర్మల మందాకినీ వీచికల దూగు రాయంచ గోల మాకెందుకూ! దయచేసి యింక మమ్మల్ని వేధించకండి"

నారాయణ పంతులుగారు నిత్యం జరీ అంచు తెల్లపంచెలే కడ తారు. ఇంకా తెల్లని వొదులు లాల్చీలే వేస్తాడు... మెడలో కండువా, నొసటిన తీర్చిదిద్దిన విభూది రేకల మధ్య తూరుపు సూర్యుడే సిందూరమైనట్టో గుండ్రని బొట్టూ, అలసట లేని చిర్నవ్వులూ... అదీ నారాయణ పంతులుగారంటే!

వారు తమ విధినిర్వహణకు కళాశాలకు వెళ్తొంటే తెలుగుతనమే కదిలిపోతోన్నట్టుంటుంది. కళాశాలకు వెళ్లగానే హాజరుపట్టీలో తెలుగులోనే సంతకం చేస్తారు. తరగతి గదిలోకి వెళ్లి-

"బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్
గూళలకిచ్చి యప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి..." అని మృదుమధుర కంఠ ధ్వనితో సాహితీ సుగంధాలను పరుస్తూ వుంటే తెలుగుదనం తెలిసిన వాళ్లెవ్వరైనా పరవశించి పోవాల్సిందే!

అందుకు భిన్నంగా జరుగుతోంది... ఏం చేస్తాం!

"డాడ్! లెటజ్ హేవ్ సం యింపోర్టెడ్ విస్కీ" అని తండ్రీ కొడుకులూ కలిసి మధుపానం చేసేంతగా ఆధునిక సమాజం ఎదుగుతూ వుంటే యింకా యీ పిచ్చి తెలుగుపంతులు డుమువులు ప్రథమావిభక్తి అంటాడేం?" అని నారాయణ పంతులుగార్ని గేలి చేసే విద్యార్థులు తయారయ్యారు. కాలగమనంలో అలాంటివాళ్లే అధిక సంఖ్యాకులై అల్పసంఖ్యాకులైన తెలుగు అభిమానుల మాట చెల్లకుండా చేసారు. తెలుగు పాఠాలు వినాలన్న వాళ్ల కుతూహలం మీద నీళ్లుచల్లుతూ పంతులుగారు పాఠాలు చెప్పకుండా అల్లరి చెయ్యసాగారు.

ఇది మహాభారత కాలం కాదు- కలికాలం.. అందునా మనది కలి యుగ ప్రజాస్వామ్యం. భారత కాలంలో గనుక కేవలం ఐదుగురు సజ్జనుల మాట చెల్లింది గానీ యీ కాలంలో అధిక సంఖ్యాకుల మాటే చెల్లితీర్తుంది... కళాశాలలో కూడా ప్రజాస్వామ్యం అలా పరిఢవిల్లి తీర్తోంది.

"విదేశీ సంస్కృతిని జీర్ణించుకుంటూ అన్య భాషల మోజులో పడి తీయందనాల తెలుగు భాషను విస్మరించకండ్రా! దాది పాలు తాగి పెరిగిన పిల్లలైనా కన్న తల్లిని మరచిపోలేనప్పుడు తెలుగు భాషనూ సంస్కృతినీ విస్మరించటం అజ్ఞానం కాదూ... " అని పంతులుగారు అడపాదడపా విద్యార్థులను మందలించేవారు. అందుకు రెచ్చిపోయే అధిక సంఖ్యాకులు వారిని మరింతగా గేలి చేసేవాళ్లు.

అప్పుడు నారాయణ పంతులుగారి కళ్లు గిల్లిన జిల్లేడు కొమ్మలే అయ్యేవి. చిత్తడితో వారి కళ్లు కడు దీనంగా కనుపించేవి. అయినా గుడ్లలో నీళ్లు గుడ్లలోనే కుక్కుకుంటూ కాస్తంత తెప్పరిల్లి తిరిగి తెలుగు పాఠమే చెప్పేవారు. శ్రావ్యంగా పద్యాలను ఆలాపించేవారు. సున్నిత హృదయం గల వారికి మాత్రమే అప్పుడు వారి గొంతులో ధ్వనించే విషాదపు జీర వినిపించేది.

ఒక రోజు పంతులుగారి పాఠం విని సహనం కోల్పోయిన విద్యార్థి ఒకడు మధ్యలోనే లేచి నిలబడి "తెలుగు పంతులుగారూ! పంచె కట్టువాళ్లు పొలం గట్లమీద తిరగాలి గానీ తెలుగు పంతుళ్లుగా వచ్చి మా ప్రాణాలు తీస్తే యెలా? నిర్మల మందాకినీ వీచికల దూగు రాయంచ గోల మాకెందుకూ! దయచేసి యింక మమ్మల్ని వేధించకండి" అన్నాడు. అధిక సంఖ్యాకులందరూ ఘొల్లున నవ్వారు. పంతులుగారి మొహంలోని జీవకళ బండి 'ర'లోనో, విసర్గలోనో అదృశ్యమైంది.

మరొక రోజు పంతులుగారు యెందుకో కొంత భావోద్వేగంతో చలించిపోతో "ప్రియమైన విద్యార్థులారా! ఇప్పటి తరగతిలో నేను మీకు విభక్తి ప్రత్యయాలు చెప్పను. యమాతారాజ భానసలగాల ప్రసక్తే తీసుకురాను. బాల, ప్రౌఢ వ్యాకరణాల ఊసే యెత్తను. మీకిప్పుడు మాతృప్రేమలోని ఔన్నత్యాన్ని గురించి మాత్రమే చెబుతాను. శ్రద్ధగా వినండి" అన్నారు.

"ఎవరికి తెలియని సబ్జక్టంటారూ అది! మా 'మమ్మీ'లూ మమ్మల్ని ప్రేమిస్తున్నారు. విదేశాల్లో గొప్ప ఉద్యోగాలు చెయ్యాలని మమ్మల్ని అపురూపంగా చూస్తూ పెద్ద చదువులు చదివిస్తున్నారు. తల్లి ప్రేమను గురించి మాకింకా మీరు చెప్పేదేమిటి?"అని అడిగాడో విద్యార్థి.

"మీ మమ్మీల ప్రేమను నేను శంకించటం లేదు. ఇప్పుడు నేను చెప్పాలనుకున్నది ఓ తల్లికోడి తన బిడ్డల పట్ల చూపించిన ప్రేమను గురించి! ఎప్పుడో చదివానో, ఎవరైనా 'మనిషి' చెబితే విన్నానో జ్ఞాపకం లేదు గానీ విషయం మాత్రం నా మనసులోనుంచి ఇప్పటికీ చెరిగిపోలేదు.

"విషయం ఏమిటంటే, ఓ పూరి గుడిసెకు అర్ధరాత్రివేళ నిప్పంటుకుంది. గుడిసెలోని వాళ్లు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు గానీ గుడిసె ప్రక్కనే వున్న కోళ్ల గంప కాలిపోయింది. కోళ్లూ మంటల్లో కాలిపోయాయి.

"బూడిద కుప్ప మధ్య తల్లికోడి విప్పార్చిన రెక్కల అవశేషాలు... ఆ అవశేషాల క్రింద చిన్న చిన్న మాంసం ముద్దల్లా పిల్లకోళ్లు కనుపించాయి...అంటే దాని అర్థం ఏమిటి"?

"మంటల్లో కాలిపోతో కూడా, తల్లికోడి తన బిడ్డలకు మంట తగలకుండా తన రెక్కల చాటున దాచుకుంది. ప్రయత్నం ఫలించకపోవటం వేరే విషయం. ఆ ప్రయత్నం వెనుక గల ఆరాటం తపన తల్చుకుంటేనే హృదయం ద్రవిస్తుంది కదూ?" అని పంతులుగారు చిత్తడి కళ్లతో విద్యార్థుల వైపు దీనంగా చూసారు.

"ఇక కోడి గోల ఆపెయ్యండి కోడి పంతులుగారూ..!" అని ఆ విద్యార్థి పగలబడి నవ్వాడు. తరగతి గదంతా నవ్వులే... నవ్వులు.

* * *

నారాయణ పంతులుగారికి ఆ రోజునుంచి 'కోడి' అన్న ఎగతాళి పేరు స్థిరపడిపోయింది. వారు కనుపిస్తే చాలు అల్లరి పిల్లలు "అడుగోరా కోడి" అని నవ్వుకోవటం మొదలైంది.

* * *

కారణాంతరాలవల్ల నేను మా ఊర్నించి వెళ్లి గుంటూరులో స్థిరపడి చాలా కాలమైంది. అడపాదడపా నారాయణ పంతులుగారు నాకు జ్ఞాపకం వస్తూనే వుండేవారు. పైగా తెలుగు భాష విషయంలో తర్జన భర్జనలూ, గాంధీగారి సత్యాగ్రహాలకన్నా యింకా సున్నితమైన ఆందోళనలూ జరుగుతూన్నాయి. కొడిగట్టిపోతోన్న తెలుగు భాషకు చమురు పోసి ప్రకాశింప జెయ్యాలనే ఆకాంక్షలూ వ్యక్తమౌతోన్నాయి.

ఆ నేపథ్యంలో నారాయణ పంతులుగారు నాకు మరి మరీ గుర్తొస్తున్నారు.

* * *

సమయం సాయంత్రం ఐదు గంటలు. ఉబుసుపోక అలా గాంధీ పార్కుకు వెళ్లాను. ప్రధాన ద్వారం వద్దనే ఎవరో వెనుకనుంచి వచ్చి నా భుజం మీద చెయ్యివేసి ఆపారు. ఆగి చూస్తే అవాక్కయ్యాను. "హౌ ఆర్యూ?" అని పలుకరించారు మా ఊరి తెలుగు పంతులుగారు.

ఆశ్చర్యంనుంచి తేరుకొని, నోటి వెంట మాటలు పెగలకపోయినా వారివైపు తేరిపార చూస్తే సూటూ, బూటూ వేసి చిర్నవ్వులు ఛిందిస్తూ కనుపించారా పంతులుగారు.

"హౌ ఆర్యూ' అనటం, అలాంటి వేషధారణలో ఎదురుగా కనుపించటంతో పంతులుగారి పట్ల నాకున్న గౌరవం మొత్తం తుడిచిపెట్టుకు పోయింది. హిమాలయాలంత ఎత్తునుంచి ఆయన క్రిందికి దిగజారి నేలబారు మనిషిలా, పిపీలికంలా నాకు తోచాడు. "పంతులుగారూ... మీరా... ఇలా?" అన్న మాటలు నా నోటి వెంట వెలువడ్డాయి.

ఆయన శాంత గంభీరంగా యథాప్రకారం చిర్నవ్వు నవ్వాడు. "అలా వెళ్ళి ప్రశాంతంగా కూర్చుందాం పదండి" అని నా చెయ్యి పట్టుకొని



"మంటల్లో కాలిపోతో కూడా, తల్లికోడి తన బిడ్డలకు మంట తగలకుండా తన రెక్కల చాటున దాచుకుంది. ప్రయత్నం ఫలించకపోవటం వేరే విషయం. ఆ ప్రయత్నం వెనుక గల ఆరాటం తపన తల్చు కుంటేనే హృదయం ద్రవిస్తుంది కదూ?"

పార్కులోపలికి తీసికొని వెళ్లాడు. ఇద్దరం గడ్డిపరకల మీద కూర్చున్నాం... ఆయనే చెప్పసాగాడు.

"మన ఊరు వొదిలిపెట్టి మీరు గుంటూరు వెళ్లిన తర్వాత ఏం జరిగిందో మీకు తెలియదు కదా! మా అమ్మాయి శైలజను మన కాలేజీలోనే చేర్పించాను. నా వెంట అమ్మాయి కాలేజికి వస్తూ పోతూండేప్పుడల్లా ఆకతాయి విద్యార్థులు "కోడిగాడి వెంట పిల్లకోడి వొస్తున్నది రోయ్ అనీ, పిల్లకోడిని ఫ్రై చేసికొని తింటే భలేగా వుంటుంది రోయర్ అనీ...

ఛీ... ఛీ...! వాళ్ల మాటలు తల్చుకుంటేనే కడుపున తెముల్తుంది.

"భయంతో గజగజా వొణుకుతూనే మా అమ్మాయి అవమానాలన్నీ భరించింది. గుంభనంగా వుండేది కానీ రాత్రివేళల్లో రహస్యంగా ఏడ్చేది... ఒక రోజు ఏం జరిగిందో తెలుసా?" దగ్గుత్తికతో అని ఆయన నా కళ్లలోకి చూడకుండానే-

"నన్నయ తిక్కన ఎర్రాప్రగడ, నాశి రకం కవిత్రయం అనీ, బైరన్ కీట్స్ షెల్లీ సాహితీ దిగ్గజాలనీ ఓ విద్యార్థి వాదనకు దిగాడు నాతో... ఎవరి గొప్పతనం వాళ్లదంటే ససేమిరా ఆ మూర్ఖుడు వినిపించుకోడు. వాదన పెంచుకొని నామీద దాడికి కూడా సిద్ధపడ్డాడు. నానా దుర్భాషలాడాడు.

"అప్పుడు నా కూతురు వచ్చింది. ఆ దృశ్యాన్ని చూసి సహించలేకపోయింది. పర్యవసానాలు ఆలోచించకుండా ఆ విద్యార్థిని చెంపదెబ్బ కొట్టింది."

"మరుసటి రోజు ఏం జరిగిందో తెలుసా! నేను కాలేజికి వెళ్లలేకపోయాను. సెలవుపెట్టి మనసు గాయాన్ని మాన్పుకొందుకు మౌన ధ్యానంచేస్తూ ఇంట్లోనే కూర్చున్నాను. అమ్మాయి కాలేజికి వెళ్లింది. వాడు దారిలోనే దాన్ని అడ్డగించాడు. చెంపదెబ్బ కొట్టినందుకు ప్రతీకారంగా దాని ఓణీ లాగివేసి దాని గుండెను తడిమి వెళ్లాడు.

"అమ్మాయి క్లాసుకు వెళ్లకుండానే ఇంటికి తిరిగి వొచ్చింది. నిష్కారణంగానే నాకూ, వాళ్ల అమ్మకూ నమస్కరించింది." ఏంటమ్మా? అని తరచి తరచి అడిగినా ఏం జరిగిందో చెప్ప లేదు... తెల్లవారాక అది మా ఇంటి బావిలో శవమై తేలింది. అది కన్నీళ్లతో రాసి పుస్తకాల్లో దాచిపెట్టిన మరణవాఙ్మూలం చదివేక గానీ ఏం జరిగిందో మాకు అర్థమే కాలేదు. గుండె చెరువయ్యేదాకా నేను నా భార్య ఏడ్చామని ప్రత్యేకంగా చెప్పే పనేమిటి? మా హృదయాలు అలా కాలిపోయాయంటే!"అని పంతులుగారు పొంగుకొచ్చిన దుఃఖోద్ధృతిని తట్టుకునేందుకు ఒక్క క్షణం ఆగి,-

"అమ్మాయి యింకా ఆ ఉత్తరంలో ఏం రాసిందో చెప్పనా! నా ఆత్మహత్యకు కారణం మా నాన్నగారు తెలుగు పంతులు కావటమే అని రాసింది. అది ఎంతగా వ్యధ చెంది అలా రాసిందో తల్చుకుంటేనే గుండె తరుక్కుపోతుంది. మన తెలుగు రాష్ట్రంలో తెలుగు పంతుళ్లకు గౌరవం లేదు. చివరికి మన తెలుగు భాష మొక్కుబడి సబ్జక్టుగా మారింది. ప్రభుత్వానిక్కూడా తెలుగంటే అలుసు. 'సెక్రెటేరియట్' అనబడే మన సచివాలయం నామ శూచిని తెలుగులో వ్రాయించేందుకు తెలుగు భాషాభిమానులు ఉద్యమాలు నిర్వహించాల్సిన దుస్థితి మనది.

"విద్య వ్యాపార వస్తువైనప్పుడు మాతృభాషల మనుగడ ప్రశ్నార్థకం కాక తప్పదు. మన సంస్కృతిని మనమే గౌరవించనప్పుడు భాషను గురించి ఆందోళన ఎందుకూ!

"ప్రియ మిత్రుడా! అవమానాలూ అవస్థలూ పొందాను. చివరికి కన్న బిడ్డను కూడా కోల్పోయాను. వేషం, భాష మార్చాను. రాళ్ల దెబ్బలు తినకుండా లౌకిక ప్రపంచంలో నేర్పుగా బ్రతుకుతున్నాను... నా తప్పేమిటి?" అని సూటిగా అడిగారాయన.

తెలుగు భాషా సంస్కృతుల విధ్వంసంలో నా పాత్రా లేకపోలేదు. అలాంటప్పుడు వారిని నేనేమి తప్పు పట్టగలను! మా అబ్బాయిని ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్పించే హడావుడిలో వున్నాను.. తెలుగు పంతులుగారికే కాదు, మీక్కూడా గుడ్ బై.